

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం: కలెక్టర్

నరసాపురం టౌన్:స్పందన అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం నరసాపురం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుండి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ విన తులను స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించే విధంగా జిల్లా, మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. స్పందన అర్జీలు రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్క రించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమస్యను పరిష్కరించే సమయంలో ఫిర్యాదుదా రునితో మాట్లాడుతున్న ఫొటో అప్‌లోడ్ చేయాలని, సమస్య పరిష్కారం కాకముందు ఉన్న ఫొటో, పరి ష్కారం అయిన తర్వాత ఫొటోలు అప్‌లోడ్ చేస్తే దరఖాస్తు పరిష్కరించబడినదిగా పరిగణనలోకి తీసు కుంటామన్నారు. మొత్తం స్పందన కార్యక్రమంలో 92 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ పాల్గొన్నారు.


రూటు మార్చి.. ఏమార్చి..!

రేషన్ బియ్యం పక్కదారి
వినియోగదారులకంటే ముందుగానే మాఫియా చేతుల్లోకి
అధికారుల తీరుపైనా అనుమానాలు
కాకినాడకు తరలింపు..!

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రేషన్‌బియ్యం పక్కదారి పడుతోంది. పగలూ, రాత్రి తేడా లేకుండా బహిరంగంగానే జిల్లా సరిహద్దులు దాటి కాకినాడలోకి ప్రవేశిస్తోంది. అక్కడ నుంచి దేశ, విదేశాలకు ఎగుమతి అవుతుంది. అధికమొత్తం కాకినాడ నుంచి ఇతర దేశాలకు ఎగుమతి అవుతుండగా మిగిలిన మొత్తం భూమి గుండ్రంగా ఉన్నట్లు తిరిగి మిల్లర్ల వద్దకే చేరుతోంది. దానికే పాలిష్‌పెట్టి సన్న బియ్యం పేరుతో కొందరు మిల్లర్లు మాయాజాలం చేస్తుండగా మరికొందరు లెవీపేరుతో ప్రభుత్వానికే తిరిగి అంటకడుతుండడం గమనార్హం.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరుతోపాటు పెదపాడు, దెందులూరు, పెదవేగి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కామవరపుకోట, జీలుగుమిల్లి, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, ఆచంట, నరసాపురం వంటి ప్రాంతాల్లో రేషన్ మాఫియా రాజ్యమేలుతోంది. ఈ ప్రాంతాల్లోని రేషన్ మాఫియా స్థానికంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉండే చిరువ్యాపారులను, కొందరు యువకులను తమకు ఏజెంట్లుగా నియమించుకున్నారు. వారిద్వారా రేషన్ బియ్యం కొనుగోలును గ్రామాల్లో, వీధుల్లో చేయిస్తున్నారు. అలా కొనుగోలు చేసిన బియ్యాన్ని చిన్నపాటి మూటలతో ద్విచక్రవాహనాల ద్వారా తమ గోదాములకు తరలిస్తున్నారు. దీనికిగానూ కిలో బియ్యాన్ని ఏజెంట్లు రూ.10 నుంచి రూ.12కు వినియోగదారుల నుంచి కొనుగోలు చేస్తుండగా వీరి వద్ద నుంచి పెద్ద వ్యాపారులు కిలో రూ.15 నుంచి రూ.17కు కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసిన బియ్యాన్ని గోదాముల్లో నిల్వ చేసి లారీల ద్వారా కాకినాడ సమీపంలో ఉన్న మండపేట పరిసర ప్రాంతాల్లోని కొందరు మిల్లర్లకు సరఫరా చేస్తున్నారు. వారు అక్కడ వాటిని నిల్వ చేసి పాలిష్ పెట్టడంతో పాటుగా బాయిల్డ్ చేస్తున్నారు. అనంతరం వాటికి బిల్లులను సృష్టించి కాకినాడలోని పోర్టు మార్గంద్వారా ఇతర దేశాలకు కిలో రూ.26 నుంచి రూ.36కు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ప్రతిరోజూ జిల్లా నుంచి సుమారు పదుల సంఖ్యలో లారీలు ఈ మిల్లర్లకు చేరుతున్నాయి. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం కొసమెరుపు.



ఇటీవల ముసునూరు మండలంలో పట్టుబడిన రేషన్ బియ్యం

ఇపోస్‌ల్లో తేడాలు..

ఉమ్మడి జిల్లాలో చాలా ప్రాంతాల్లో వినియోగదారునికి చేరకముందే రేషన్‌బియ్యం మాఫియా చేతుల్లోకి వెళ్తుంది. ప్రతినెలా ఈ విధంగా రేషన్ డిపోలకు నెలాఖరునాటికి రేషన్‌బియ్యం చేరుకోగానే అదేరోజు రాత్రి మాఫియా ప్రత్యేక వాహనాల్లో అందులో కొంతభాగం బియ్యాన్ని తరలించుకుపోతుంది. మిగిలిన బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్లు ఆ తర్వాత వచ్చిన వారికి బియ్యం లేవని చెబుతుండడం గమనార్హం. దీంతో వినియోగదారులు ఏం చేయాలో తెలియక మరో డిపో వద్దకు రేషన్ పంపిణీ వాహనం వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. రేషన్‌పంపిణీ వాహనదారులు కూడా దీనిలో తమవంతు పాత్రను పోషిస్తున్నారు. వారుకూడా ఎక్కడ వాహనం పెడుతున్నారో? ఏ రోజు ఏ సమయానికి పెడుతున్నారో కూడా సరైన సమాచారాన్ని ఇవ్వడం లేదు. దీంతో వినియోగదారులు చాలామంది రేషన్‌బియ్యం తెచ్చుకోవడం మానేస్తున్నారు. మరికొందరు వేలిముద్రలు వేసి డీలర్ల వద్దనే నగదు తీసుకుని వెళ్లిపోతున్నారు.

మిల్లర్ల ద్వారా తిరిగి లెవీగా సేకరణ..!

కొందరు మిల్లర్లు చిరువ్యాపారుల ద్వారా రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. రబీ, ఖరీఫ్ సీజన్‌లలో వచ్చిన ధాన్యాన్ని నిల్వ చేసి దానిస్థానంలో లెవీగా ప్రభుత్వానికి నిల్వ ఉంచిన రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు. దీంతో తిరిగి ప్రభుత్వం ద్వారా అవే బియ్యం వినియోగదారులకు వస్తున్నాయి. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆడించి అధికధరలకు బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ రేషన్‌బియ్యం మాఫియా వ్యవహారం కిందిస్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారుల వరకూ అందరికీ తెలిసినా ఎవరికి వారు తమకెందుకులే అనేరీతిలో వ్యవహరిస్తున్నారు. రేషన్ మాఫియా భారీస్థాయిలో ముడుపులు ముట్టజెబుతుండడంతో ఈ విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలూ లేకపోలేదు. అంతేకాకుండా అడపాదడపా వాహనాలను పట్టుకుని కేసులు పెడుతున్నా నామమాత్రపు కేసులే పెడుతుండడంతో వారు తిరిగి ఇదే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. పీడీ యాక్టు పెట్టే అవకాశాలున్నా అధికారులు ఆ దిశగా ఆలోచన చేయకపోవడంపై పలువురు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

ఆక్వా రైతులను విస్మరించిన సిఎం జగన్

హామీ నెరవేర్చడంలో మాట తప్పి.. మడమ తిప్పారు
'ఆక్వా రైతు పోరుబాట - రైతుల కోసం తెలుగుదేశం' కార్యక్రమంలో శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల
సబ్‌స్టేషన్ ముట్టడిలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - ఉండి

ఆక్వా రైతులకు సిఎం జగన్ ఇచ్చిన హామీలో మాట తప్పి మడమ తిప్పారని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. ఆక్వారంగానికి పశ్చిమగోదావరి జిల్లా పుట్టినిల్లు అని ఆయన అన్నారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కోట్ల ఫంక్షన్ హాలులో నిర్వహించిన 'ఆక్వా రైతు పోరుబాట - రైతుల కోసం తెలుగుదేశం' కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ సిఎం జగన్ జిల్లాలో పాదయాత్రలో ఆక్వా రైతుల సమస్యలను తెలుసుకుని టిడిపి ప్రభుత్వం ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రెండు రూపాయలకు ఇవ్వగా, తమ పార్టీ అధికారంలోకి వస్తే ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50కే ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు కొంతకాలం ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీని ఇచ్చి తర్వాత కాలంలో మాట తప్పి, మడమతిప్పి ఆక్వా రైతులను ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ విభాగాలుగా మార్చి ఆక్వాజోన్‌లో ఉన్న రైతులకు మాత్రమే విద్యుత్ సబ్సిడీ అందిస్తానని చెప్పడం సమంజసం కాదన్నారు. వైసిపి అధికారం చేపట్టాక సుమారు రూ.50 వేల కోట్లు విదేశీ మారకద్రవ్యాన్ని అందిస్తున్న ఆక్వారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని వారు వాపోయారు. అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్ అప్పుల ఊబిలోకి కూరుకుపోయిందని విమర్శించారు. వైసిపి ఎమ్మెల్యేలు ఎకరం చెరువు తవ్వడానికి రూ.పది వేలు కమిషన్ తీసుకుంటున్నారని వారు ఆరోపించారు. ఆక్వా రైతులు, కొనుగోలుదారులతో మంత్రుల సమక్షంలో జరిగిన సదస్సులో సిఎం జగన్ 100 కౌంట్ రొయ్యకు రూ.270 ధర నిర్ణయించారని కానీ ఇప్పటివరకూ రూ.170 కూడా కొనే పరిస్థితి లేదని గిట్టుబాటు ధర లేకపోవడంతో ఆక్వా రైతులకు ఆత్మహత్యే శరణ్యంగా మారిందన్నారు. నాణ్యమైన ఫీడ్, సీడ్‌లను రైతులకు అందకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీడ్, ఫీడ్ తయారుచేసే కంపెనీలపై పర్యవేక్షణ లేకపోవడంతో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ కొనసాగించాలని నాణ్యమైన ఫీడ్, సీడ్, అందించి రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆక్వా రైతులకు విద్యుత్ యూనిట్ రూ.1.50కే ఇస్తామన్నారు. అనంతరం బిజెపి మాజీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ వైసిపి పాలనలో ఆక్వా రైతులు అధోగతి పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను పార్టీలకతీతంగా ఆక్వా రైతుగా ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి, గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పత్తిపాటి పుల్లారావు, చిక్కాల రామచంద్రరావు, గొల్లపల్లి సూర్యారావు, పీతల సుజాత, మాగంటి బాబు, కొల్లు రవీంద్ర, బూరుగుపల్లి శేషారావు, ఆరిమిల్లి రాధాకృష్ణ, నిమ్మకాయల చిన రాజప్ప, ముప్పిడి వెంకటేశ్వరరావు, జయ మంగళం వెంకటరమణ, కెఎస్.జవహర్, వేటుకూరి వెంకట శివరామరాజు, రైతు విభాగం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, అధిక సంఖ్యలో ఆక్వా రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యనలమ రామకృష్ణుడు

విద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడిలో ఉద్రిక్తత

ఆక్వా రైతు పోరుబాట- రైతు కోసం తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీని పునరుద్ధరించాలని కోరుతూ టిడిపి ప్రతినిధులు చేపట్టిన 220కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడిలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ర్యాలీగా వెళ్తున్న పార్టీ నాయకులను, కార్యకర్తలను, ఆక్వా రైతులను నరసాపురం డిఎస్‌పి వీరాంజనేయరెడ్డి నేతత్వంలోని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వాగ్వావాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆకివీడు కానిస్టేబుల్ ఐతం సుబ్బారావుకు కాలువిరిగింది. వెంటనే అతన్ని భీమవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ గేటు వెలుపల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పోలీసులు ప్రభుత్వానికి తొత్తులుగా మారిపోయారని విమర్శించారు. అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదని వారు గుర్తుంచుకోవాలని పోలీసులనుద్దేశించి హెచ్చరించారు. శాంతియుతంగా జరిగే నిరసన కార్యక్రమాన్ని బెటాలియన్‌ను ఉపయోగించి అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొందని దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

అభివృద్ధికి సహకరించాలి : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

గ్రామంలోని ప్రతిఒక్కరు ఏకాభిప్రాయంతో ఉంటేనే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందని డిసిసిబి ఛైర్మన్, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. సోమవారం ఉండి మండలం వాండ్రం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసిన ప్రతీ సచివాలయానికి సిఎం జగన్ రూ.20 లక్షల నిధులు కేటాయించారని, ఆ నిధులతో గ్రామంలోని నాయకులందరి ఏకాభిప్రాయం మేరకు రామాపురం ప్రాంతంలో నాలుగు సీసీ రోడ్లను నిర్మించడానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ, వైసిపి మండల కన్వీనర్, ఎంపిటిసి పెన్మెత్స ఆంజనేయరాజు, ఉండి రూరల్ బ్యాంక్ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణరాజు, మాజీ సర్పంచి రెడ్డిపల్లి సత్యనారాయణ, నాయకులు బుద్ధరాజు రంగరాజు, యాడంగి ఏసు, కె.రాజేంద్రకుమార్, గుండుబోయిన రాంబాబు, మీసాల అప్పల కృష్ణ, ఉప్పలపాటి చంటి రాజు, బుద్ధరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

న్యాయ సేవాధికార సంస్థ ఆశయాలు, లక్ష్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాలుగో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ విఎస్ఎస్.శ్రీనివాసశర్మ అన్నారు. బలంగా తీసుకెళ్లే నేపథ్యంలో కాలేజీల్లో, పాఠశాలల్లో, ఆసుపత్రుల్లో, మహిళలకు, వయోవృద్ధులకు, వసతి గృహాల్లో, బస్టాండు, రైల్వేస్టేషన్‌ల వద్ద కరపత్రాలు పంపిణీ చేసి, న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించి, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియాల ద్వారా ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించామని నాలుగో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ విఎస్ఎస్.శ్రీనివాసశర్మ అన్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 12వ తేదీ శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1028 కేసులు రాజీ చేశామని తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా సామరస్యంగా కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్‌లను కక్షిదారులు ఆశ్రయిస్తున్నారని తెలిపారు. కేసులు పరిష్కారమైతే డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. సమాచార హక్కు చట్టాన్ని కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎవి.నాగరాజు పాల్గొన్నారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం నియోజకవర్గంలో ఈ నెల 18న సిఎం పర్యటనను విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులను, కార్యకర్తలను ఆదేశించారు. సోమవారం మండలంలోని ఎల్‌బిచర్ల, వైఎస్‌పాలెం, సారవ తదితర గ్రామాల్లో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చీఫ్‌విప్ మాట్లాడుతూ సిఎం పర్యటనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. వాలంటీర్లు తమకు కేటాయించిన ప్రతి ఇంటికి వెళ్లి సీఎం సభలో పాల్గొనేలా ప్రతి ఒక్కరిని ఆహ్వానించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి మైలా బత్తుల సోనీ, వైస్ ఎంపిపి రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

18న సిఎం జగన్ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

నరసాపురం టౌన్:ఈ నెల 18న సిఎం జగన్ నరసాపురం పర్యటనలో లోపాలకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పర్యటన ఏర్పాట్లు పగడ్బందీగా చేయాలన్నారు. వాటర్ గ్రిడ్, ఆర్‌టిసి బస్టాండ్, వంద పడకల ఆసుపత్రి, సబ్ స్టేషన్, ఫిషింగ్ హార్బర్, ఆక్వా యూనివర్సిటీ తదితర పనులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి హెలీప్యాడ్ నుండి డయాస్ వరకూ రహదారులు, పట్టణమంతా పూర్తి శానిటేషన్, పూల మొక్కలతో సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. సబ్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం హెలీప్యాడ్, వాటర్ గ్రిడ్, బస్టాండ్, హాస్పిటల్, పబ్లిక్ మీటింగ్ జరిగే ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

అక్రమ నిర్మాణాలు ఆపాలి

స్పందనలో సిపిఎం నేతల వినతి

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రభుత్వ భూములను ఆక్రమించి చేపడుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో నోడల్ అధికారి, తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ పరిధిలోని 15వ వార్డులో సమతా నగర్‌రోడ్లులో చాకలిచెరువును ఆనుకుని ఉన్న కొల్లేరు కాంటూర్ 5కు దిగువన ఉన్న ఖాళీ స్థలం ఆక్రమించుకొని నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు ప్రారంభించారని తెలిపారు. వెంటనే నిర్మాణాన్ని ఆపాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, నాయకులు పెంకి అప్పారావు, ఎస్‌కె.వలీ, డోకల లక్ష్మి, బివి.వర్మ, డోకల రవితేజ, గేదెల ధనుష్ పాల్గొన్నారు.

నెహ్రూ ఆశయాలు ఆదర్శం

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - నరసాపురం

భారత దేశ తొలి ప్రధాని నెహ్రూ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం పురపాలక సంఘం కార్యాలయంలో జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూల మాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని నవంబరు 14న జరుపుకునే బాలల దినోత్సవాన్ని 'బాల్ దివాస్' అంటారన్నారు. జవహర్‌లాల్ నెహ్రూకు పిల్లల పట్ల ప్రేమ, ఆప్యాయత అమితమైందన్నారు. దేశానికి అత్యధిక కాలం ప్రధానిగా నాయకత్వం వహించిన మొదటి ప్రధానమంత్రి అన్నారు. ఆయన బాలలు, యువత కోసం చాలా మంచి కార్యక్రమాలు చేసి వారి బంగారు భవిషత్‌కు బంగారు బాటలు వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - వీరవాసరం

విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని రాయకుదురు సర్పంచి గెద్దం భారతీ భాస్కరరావు సూచించారు. జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలు వీరవాసరం, రాయకుదురు గ్రంథాలయాల్లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సర్పంచి గెద్దం భారతీభాస్కరరావు మాట్లాడుతూ విజ్ఞాన భాండాగారాలుగా స్థానిక గ్రంథాయాలు విరాజిల్లుతున్నాయన్నారు. విద్యార్థి దశ నుండి గ్రంథాలయాలను సందర్శించడం అలవర్చుకోవాలన్నారు. అనంతరం నెహ్రు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాయల ఛైర్మన్ చిలకపాటి సుధాకరావు, వైస్ ఛైర్మన్ జుత్తిగ ప్రసాద్, షేక్ సత్కార్‌సాహెబ్ పాల్గొన్నారు.



పాలకోడేరు : వారోత్సవాల్లో మాట్లాడుతున్న సర్పంచి లక్ష్మి

నరసాపురం : ప్రభుత్వ 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం వద్ద ఎంఇఒ పుష్పరాజ్యం వారోత్సవాలను ప్రారంభించారు. వార్డ్ కౌన్సిలర్ సిర్రా కాంతమ్మ పోటీలను ప్రారంభించారు. ముందుగా వైస్ ఛైర్మన్ కామన నాగిని బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ చినమిల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పండా త్రినాథ్, ఆర్‌వి సుబ్బారావు, సుధీర్ మోహన్, సూర్యం బాబు పాల్గొన్నారు.

పోడూరు : జిన్నూరు శాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత గ్రంథాలయంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి గ్రామ సర్పంచి జమ్ము బేబీ మహాలక్ష్మి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పండిట్ జవహర్లాల్ నెహ్రూ, గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణ చిత్రపటాలకు సొసైటీ అధ్యక్షులు డిటిడిసి బాబు పూలమాలలు వేశారు. అనంతరం జరిగిన సమావేశంలో దాతలు ఆర్థిక సహకారంతో పేద విద్యార్థులకు దుస్తులు డిటిడిసి బాబు జమ్మూ మృత్యుంజయరావు అందజేశారు. వృద్ధ రంగస్థల కళాకారుడు తాళాబత్తుల గాంధీకి రూ.2000 ఆర్థిక సాయం సర్పంచి జమ్మూ బేబీ మహాలక్ష్మి అందచేశారు. అలాగే ఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో కొప్పర్తి నరసింహమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండి : విద్యార్థులు పుస్తక పఠనంతోనే విజ్ఞానవంతులుగా మారతారని ఉండి సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ అన్నారు. సోమవారం ఉండి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శేషాద్రి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి వీరమల్లు సత్యవతి, పశు వైద్యాధికారి జి.మల్లేశ్వరరావు, శశి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ ఖండాపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తణుకురూరల్ : గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జన కేంద్రాలుగా పనిచేస్తున్నాయని ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అన్నారు. స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్)లో 55వ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం.హరనాధరావు, ఎస్.గీత, డి.స్రవంతి పాల్గొన్నారు.

పాలకోడేరు : గొల్లలకోడేరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల ప్రాముఖ్యతను గొల్లలకోడేరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని రామలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో సర్పంచి కె.లక్ష్మి, గ్రంథాలయ పాలకుడు పాలా అపర్ణకుమార్ పాల్గొన్నారు. పెన్నాడ బైట్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఎన్‌ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో గొరగనమూడి, పెన్నాడ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ కొప్పర్తి సురేష్, డీన్ కుర్రెళ్ల భాస్కర్‌రావు బహుమతులు అందించారు.

పాలకొల్లు : విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత వంగా నరసింహారావు అన్నారు. పాలకొల్లు శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాడభూషి కృష్ణప్రసాద్ సారథ్యంలో సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వర్ధనపు శాంతకుమారి, యు.పెద్దిరాజు, కెవివి సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి - మొగల్తూరు

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించి వారి సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం మొగల్తూరులోని సచివాలయ కార్యాలయం వద్ద అంగన్వాడీలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేసి ఆయిల్ కందిపప్పు క్వాంటిటీని పెంచాలన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, నూతన విద్యా విధానం రద్దు చేయాలని, అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు . అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు మేడిద స్వర్ణలత, జి.పెద్దింట్లు, కె.నాగదుర్గ, ఎస్.స్వర్ణ, ఎం.సీతారత్నం, కె.శ్వేత, కె.ధనలక్ష్మి, బి.పార్వతి, వై.సునీత, బి.జీవనకుమారి, బి.శేషకుమారి ఉన్నారు.



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

16, 17 తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభ

ప్రజాశక్తి - పెంటపాడు

ఈ నెల 16, 17 తేదీల్లో పాలకొల్లు పట్టణంలో జరగనున్న సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపవరపు రంగారావు, జిల్లా కమిటీ సభ్యులు చిర్ల పుల్లారెడ్డి, బొంకూరు నాగేశ్వరరావు తెలిపారు. పెంటపాడు ప్రజా సంఘాల కార్యాలయంలో ముఖ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అసంఘటిత కార్మికులు కోట్ల మంది ఉన్నారని, వారికి కనీస వేతనాల జిఒ అమలు చేయడం లేదని తెలిపారు. బ్రిటీష్ కాలం నుండి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాశి, యజమానులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చారని తెలిపారు. ఈ మధ్యకాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫిక్స్ టర్మ్ ఎంప్లాయ్ అనే పేరుతో కార్మికులకు, ఉద్యోగులకు ఏ విధమైన హక్కులు లేకుండా చట్టాలు రూపొందిస్తున్నారని, ఈ చట్టాలకు వ్యతిరేకంగా మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ తీసుకుంటామని తెలిపారు. అలాగే జనవరి రెండు మూడు నాలుగు తేదీల్లో భీమవరంలో రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని, వాటిని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మీసాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సొసైటీల ద్వారా ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - ఆచంట

సహకార బ్యాంకుల ద్వారానే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. ది మృత్యుంజయ కోపరేటివ్ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సహకార వారోత్సవాల్లో భాగంగా సోమవారం సొసైటీ ఆవరణలో సొసైటీ కిషోర్ కుమార్ జెండా ఆవిష్కరించారు. సందర్భంగా సొసైటీ కార్యదర్శి పారుపల్లి ఏసురత్నం మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలందించేందుకు సహకార బ్యాంకులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. తమ సొసైటీలో రైతులకు విస్తృత సేవలందిస్తున్నామన్నారు. సొసైటీ ఆదాయాన్ని పెంచాలనే లక్ష్యంతో కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా త్రిసభ్య కమిటీ సభ్యులు, బ్యాంక్ సిబ్బంది ఎంతగానో పాటుపడుతున్నారన్నారు. అనంతరం సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పిచ్చెట్టి సత్యనారాయణ, ఎం.శ్రీనివాస్, బ్యాంక్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

గూడెంలో సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సిపిఎం శిక్షణా తరగతులు కరెడ్ల రామకృష్ణ అధ్యక్షతన స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కేతా గోపాలన్, సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడారు. ప్రజల తరపున రాజీలేని పోరాటం చేసేది భారత కమ్యూనిస్టు పార్టీ అని తెలిపారు. దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఉన్నత ఆశయాలే ఆయుధాలుగా నడుస్తున్న ఏకైక పార్టీ సిపిఎం అని తెలిపారు. మతోన్మాద రాజకీయాలపై రణభేరిగా, కుల వివక్షపై మోగే శంఖారావంగా, యువతీ యువకుల ఆశయ స్వచ్ఛతకు నిదర్శనంగా దేశ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తిగా అర్ధశతాబ్దం పూర్తి చేసుకున్న ప్రజాస్వామ్య ప్రగతిశీల రాజకీయ శక్తి సిపిఎం అని తెలిపారు. వామపక్షాలు ఈ 50 ఏళ్లలో సామ్యవాద భావజాలానికి లౌకిక ప్రజాస్వామ్య విలువలకు అంకితమై వాటిని కాపాడేందుకు ఎల్లవేళలా కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జి.నాగేశ్వరరావు, జె.శ్రీను, ఎస్.శేషుబాబు, పి.శ్రీను, ఎం.రాజు, వి.అప్పారావు, పి.నాగేంద్రబాబు పాల్గొన్నారు.


వనభోజన కార్యక్రమంలో మార్టేరు వైబిఎ బృందం

మార్టేరులో వన సమారాధన

ప్రజాశక్తి - పెనుమంట్ర

కార్తీక మాసాన్ని పరిస్క రించుకొని సోమవారం మార్టేరు ఎస్‌విజిహెచ్ హైస్కూల్ ఆవరణలో రెండో ఏడాది వైబిఎ బృందం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. వైబిఎ అధ్యక్షుడు సత్తి సుబ్బన్నరెడ్డి వరలక్ష్మి, కార్యదర్శి శ్రీనివాసులు మురళీకృష్ణ కాశీ రమణ దంపతులు తెలుగు సాంప్రదాయ పద్ధతిలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 240 మంది వైబిఎ బృందంతో పాటు క్రీడాకారులు, క్రీడాభిమానులతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం కిషోర్ ఛారిటబుల్ ట్రస్ట్, వైబిఎ ఆధ్వర్యంలో నిర్వహించారు. హైస్కూల్ హెచ్‌ఎం సిహెచ్ శివ జ్యోతి, ఇ లక్ష్మణ రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సోమారెడ్డి, సత్తిరెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

కనకరత్నమాలకు పురస్కారాలు

ప్రజాశక్తి - ఆచంట

భీమలాపురం గ్రామానికి చెందిన శ్రీదేవి ఆర్యవైశ్య మహిళా సంఘం సీనియర్ నాయకురాలు, వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కొత్త కనకరత్నమాలకు బెస్ట్ క్లబ్, బెస్ట్ ప్రెసిడెంట్, బ్రెస్ట్ సర్వీస్, బెస్ట్ గవర్నర్ అవార్డులు వచ్చినట్లు ఆమె సోమవారం విలేకరులకు తెలిపారు. ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ డిప్యూటీ 201 కాన్ఫిరెన్స్ గవర్నర్ ఎర్రింకి సూర్యారావు అధ్యక్షతన సమావేశం భీమవరంలో జరిగిందన్నారు. ఈ అవార్డులను ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎంవి.నేతాజీ సుబ్బారెడ్డి, నెల్లూరు ఎలక్ట్రిడు ప్రెసిడెంట్ రవీంద్ర, విశాఖపట్నం ఏరియా ప్రెసిడెంట్ ఆర్.కృష్ణారావు, విజయవాడ 201 గవర్నర్ సూర్యారావు చేతులమీదుగా అవార్డు తీసుకున్నట్లు తెలిపారు. ఆమెకు అవార్డులు రావడం పట్ల ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, మాజీ ఎంఎల్‌ఎ బంగారు ఉషారాణి, వాకర్స్ క్లబ్ నాయకులు తెలిపారు.

శివాలయాలు కిటకిట

ప్రజాశక్తి - పాలకొల్లు

కార్తీక సోమవారం సందర్భంగా క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయానికి యాత్రికులు పోటెత్తారు. దీంతో దేవస్థానం ఉచిత అన్నదానానికి యాత్రికులు క్యూలైన్లలో పడిగాపులు పడ్డారు. వస్త్ర వ్యాపారి బాలి ఏడుకొండలు వరుసగా 3వ సోమవారం వందల మందికి ఉచిత భోజనాలు ఏర్పాటు చేశారు. యునైటెడ్ కాపు క్లబ్, క్షీర పురి అన్నదాన సమితి, టౌన్ హాల్, ప్రిన్స్ స్టోర్స్ వంటి పలు స్వచ్ఛంద సంస్థలు ప్రసాద వితరణ, బాదం పాలు పంపిణీ చేశారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ, ట్రస్టీలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వీరవాసరంలో ఎఎస్‌పి విచారణ

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కేసులకు సంబంధించి విచారణ నిమిత్తం జిల్లా అడిషనల్ ఎస్‌పి సుబ్బరాజు సోమవారం వీరవాసరంలో పర్యటించారు. వీరవల్లి శ్రీనివాసరావు తమను కులం పేరుతో దూషించాడంటూ పాలపర్తి సాల్మన్‌రాజు, మిక్కిలి శ్యాంకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది. ఇదే విధంగా వీరవాసరంలో నివాసముంటున్న వీరవల్లి శ్రీనివాసరావు ఇంటికి వచ్చిన రావాడ రామ్మోహన్‌రావు మరో ముగ్గురు వ్యక్తులు తన ఇంటికొచ్చి తనభార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులు పరస్పర ఫిర్యాదు మేరకు వీరవాసరం పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయగా వీటిని విచారించడానికి అడిషనల్ ఎస్‌పి సుబ్బరావు వీరవల్లి శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి అతని కుమారుడు నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పక్కనే నివాసరం ఉంటున్న వారిని, పరిసర వ్యాపారస్తుల నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయన వెంట సిఐ నాగప్రసాద్, ఎస్‌ఐ రమేష్, భీమవరం టుటౌన్ ఎస్‌ఐ ధర్మారావు ఉన్నారు.

ర్యాలీని జయప్రదం చేయాలి

తాడేపల్లిగూడెం: ఈనెల 26న జరగనున్న భవననిర్మాణ కార్మికుల జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లిగూడెంలో కార్మిక కేంద్రాల్లో చేపట్టిన ప్రచారకార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక నందిబొమ్మ సెంటర్లో ఆరు మకాములకు చెందిన కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమసుందర్ మాట్లాడుతూ భవననిర్మాణ కార్మిక సమస్యల పరిష్కారం కోసం యూనియన్ చేస్తున్న పోరాటాల్లో కార్మికులు భాగస్వాములు కావాలని కోరారు. 26న రాజమండ్రి ర్యాలీలో పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. జిల్లా అధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఏరియా తాపీ, వడ్రంగి, సెంటరింగ్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, యూనియన్ పూర్వాధ్యక్షులు దువ్వా శ్రీనివాస్, కొల్లూరు రాంబాబు పాల్గొన్నారు.

కరాటేలో పాలకొల్లు విద్యార్థుల ప్రతిభ

పాలకొల్లు : తణుకులో ఆదివారం జరిగిన 3వ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో పాలకొల్లు జపాన్ షోటోకాన్ కరాటే డు- కనంజూకు ఆర్గనైజేషన్ హెడ్ ధనాని సూర్యప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. కటా, కుమితే విభాగాల్లో 8 మంది విద్యార్థులు పాల్గొనగా కటా విభాగంలో ఏడుగురు ప్రథమ స్థానం, ఒకరు ద్వితీయ స్థానం సాధించారు. కుమితే విభాగంలో ఆరుగురు ప్రథమ స్థానం, ఒకరు ద్వితీయ స్థానం సాధించారు. విద్యార్థులను సంస్థ ఇన్స్ట్రక్టర్స్ ధనాని సూర్యప్రకాష్, సిహెచ్.లక్ష్మీనారాయణ, ఎన్.అప్పలస్వామిలకు పలువురు అభినందనలు తెలిపారు.

ఇసుక లారీ బోల్తా

పెనుగొండ: మండలంలోని నడిపూడి ఇసుక ర్యాంపు నుంచి లోడుతో వెళ్తున్న ఇసుక లారీ ఏటిగట్టు పైకి వెళ్లే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. దీంతో డ్రైవర్‌కి స్వల్ప గాయాలయ్యాయి.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి - ఆచంట

వివిధ దేశాల జాతీయ పోరాటాలను అధ్యయనం చేసి బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన మహాయోధులు మాజీ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ అని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి కొనియాడారు. నెహ్రూ జయంతి సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే కొడమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారాం నెహ్రూ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జగన్నాథరావు, వైస్ ఎంపిపిలు ఎర్రగుప్పుల నాగరాజు, తాళం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: బాలల దినోత్సవం సందర్భంగా పూలపల్లి అంగనవాడీ కేంద్రంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి అంగన్వాడి టీచర్ అడబాల కనకదుర్గ నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజుల రామాలయం వీధి, పూలపల్లి చిన్నపేట, ఈదావారిపేటకు చెందిన అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. సగంచెరువు గ్రామం ఎన్‌ఆర్‌పేట ఎంపిపి స్కూల్లో సోమవారం బాలల దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయిని యడ్ల కళావతి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలతో మురిపించారు. భరతమాత, ఝాన్సీ లక్ష్మీబాయి, అంబేద్కర్ వేషధారులు చూపరు లను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో టీచర్స్ సాధిక్ ఉన్నీసా, పంపన లక్ష్మీనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు. లంకలకోడేరు మెయిన్, లంకలకోడేరు-2, వెదుళ్లపాలెం, రాజీవ్‌కాలనీల్లో అంగన్వాడీ కేంద్రాల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మొగల్తూరు : విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ అన్నారు. స్థానిక వివేకా ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, పరుగుపందెం, తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఉండవల్లి గీతా రాంబాబు మాట్లాడారు. ఈ నేపథ్యంలో 'వివేకా కప్‌డు హ్యాండ్స్ ఫుల్ రైస్' కార్యక్రమంలో భాగంగా సమకూర్చిన బియ్యం, పండ్లు, దుస్తులను సుమారు 80 మంది పేదలకు అందజేశారు. కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ సభ్యులు రాయుడు లక్ష్మణరావు, కడిమి సాంబమూర్తి, ఇఒపి ఆర్‌డి మేడిది నవీన్‌కిరణ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


కాళ్ల : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంపిపి గోపాలకృష్ణంరాజు

పెనుమంట్ర: బాలల దినోత్సవం సందర్భంగా సోమవారం బ్రాహ్మణ చెరువు సూర్యారావుపేట ఎంపిపి స్కూల్లో సుమారు 250 మంది పిల్లలకు ఐద్వా ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మజ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక పెరగాలన్నారు. మానసిక వికాసానికి ఆటపాటలు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు వల్లెం హేమలత, వార్డ్ మెంబర్ అనురాధ, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

కాళ్ల: విద్యార్థుల్లో సృజనాత్మకను పెంచేందుకు ఆటలు పోటీలు ఎంతో ఉపయోగపడతాయని మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. సోమవారం బాలల దినోత్సవం సందర్భంగా కాళ్లకూరు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించిన మాజీ ఎంపిపి వేగేశ్నవెంకట గోపాలకృష్ణంరాజును అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.రామకృష్ణ, ఉపాధ్యాయులు ఎస్.మావుళ్లమ్మ, జి.శ్రీనివాసరాజు, సిహెచ్ ఉమామహేశ్వరి, ఎ.పెద్దిరాజు, సుధాకర్, ప్రసాద్, ప్రవల్లీక్, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ శివకష్ణ పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు మాంటిస్సోరీ స్కూల్లో రోటరీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. అనంతరం చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించి 36 మందికి బహుమతులు ప్రదానం చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. పట్టణంలోని ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో బాలల దినోత్సవంలో భాగంగా జిల్లా స్థాయి లిటరరీ పోటీలు సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఛాంబర్ ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు, ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ పోటీల్లో జిల్లాలోని పలు కళాశాల నుండి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఎల్‌ఆర్ పేట యూనియన్ బ్యాంక్ మేనేజర్ స్వాతి విజేతలకు బహుమతులు అందజేశారు.

తాడేపల్లిగూడెం: శశి ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకంలో భాగంగా సైట్ రెడ్ యాంట్స్, వాలంటీర్ విద్యార్థులు సోమవారం ప్రభుత్వ బాలికల పాఠశాలలో జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లతో వివిధ క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శశి కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షేక్ సల్మాన్ భాషా మాట్లాడారు. కార్యక్రమంలో శశి కళాశాల ఛైర్మన్ బూరుగుపల్లి వేణు గోపాలకృష్ణ, వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ క్రాంతి సుధ మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పోడూరు : నెహ్రూ జయంతిని గుమ్మలూరు మండల పరిషత్ ప్రాథమిక ప్రధాన పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పి.శాంతాగ్రేస్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండలం విద్యాశాఖాధికారి ఎఎస్‌కెవి.ప్రేమజ్యోతి పాల్గొని ప్రసంగించారు. అనంతరం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

తణుకురూరల్: బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్, పైడిపర్రు ప్రధానోపాధ్యాయులు నేపపాటి వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు శాంతి ర్యాలీ నిర్వహించారు. గాంధీ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో దేశభక్తిని చాటుతూ గేయాలు, నాటికలు, ఏకపాత్రభినయాలు, జాతీయ నాయకుల వేషధారణ, నాట్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి కావలిపురపు మూర్తి, రామకృష్ణ, రామలక్ష్మీ, పిసి కమిటీ ఛైర్‌పర్సన్ ఎస్‌కె మీరాబేబి పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపల్ ఆకన రవిచంద్రన్, గౌతమి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ కైలా నరేష్, సూర్య ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ వీరవల్లి పాండుల బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.

పాలకోడేరు : విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని విస్సాకోడేరు సర్పంచి బొల్లా శ్రీనివాస్ సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడా సామగ్రిని సర్పంచి అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు బొర్రా లక్ష్మణ్, నాగేంద్ర, శివ, మల్లేశ్వరరావు పాల్గొన్నారు. విస్సాకోడేరు సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో జవహర్ లాల్ నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. బాలల దినోత్సవం సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ స్వర్ణలత మాట్లాడారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - వీరవాసరం

అభివృద్ధే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తోందని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంఎల్‌ఎ గ్రంధి సోమవారం పాల్గొన్నారు. రూ.16 లక్షలతో పంజావేమవరంలో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి ఎంఎల్‌ఎ శంకుస్థాపన చేశారు. బలుసులగొయ్యిపాలెంలో నాడు-నేడులో భాగంగా రూ.49.10 లక్షలతో పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి, అదే పంచాయతీ పరిధిలోని వీరవల్లిపాలెంలో రూ.33.22 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎంఎల్‌ఎ శంకుస్థాపన చేశారు. అనంతరం అండలూరు సహకార సంఘం కార్యాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గూడూరి ఓంకారం, సర్పంచి ఇళ్ల పూర్ణబాల భారతీ, ఇళ్ల శ్రీనివాస్, సొసైటీ ఛైర్మన్ చవాకుల సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

తండ్రి ఆశయ సాధనకు రవి వర్మ కృషి

ప్రజాశక్తి - కాళ్ల

స్వాతంత్ర్య సమరయోధులు మంతెన వెంకట సూర్యనారాయణరాజు ఆశయాలను ఆయన తనయుడు మంతెన వెంకట రవివర్మ కొనసాగించడం అభినందనీయమని పలువురు వక్తలు మాట్లాడారు. జువ్వలపాలెంలో మంతెన వెంకట సూర్యనారాయణ రాజు, సుభద్రయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన తనయుడు మంతెన వెంకట రవి వర్మ ఆర్థిక సహకారంతో పండ్లు, పూల మొక్కలు సోమవారం పంపిణీ చేశారు. తల్లిదండ్రుల పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని లయన్స్ జెడ్సీలు రుద్రరాజు సూర్యనారాయణ రాజు, గుర్రం శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం డయాబెటిక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి కటారి లక్ష్మీపతిరాజు, ఎంపిటిసి మీసాల శ్రీనివాస్, గోకరాజు వినోద్‌బాబు, ముదుండి సురేష్‌రాజు, కనగర్ల గాంధీ, సెక్రటరీ గొట్టుముక్కల రామకృష్ణంరాజు, బోధనపు కన్నయ్య, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మొక్కలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షులు మంతెన వెంకటరవి వర్మ

సీతారామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని ఎడ్వర్డ్ ట్యాంక్ వద్ద ఉన్న సీతా రామలింగేశ్వర స్వామి ఆలయ పున:నిర్మాణానికి ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ రంగం సిద్ధం చేశారు. ఈ ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా రూ.కోటి నిధులు మంజూరు చేయించారు. యాత్రికుల నుంచి రూ.33 లక్షల 33 వేల వరకూ కాంట్రిబ్యూషన్ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండడంతో, ఈ నిధులను కూడా ఎంఎల్‌ఎ సోమవారం స్వయంగా పలువురికి ఫోన్ చేసి సేకరించారు. రూ.23 లక్షల వరకు నిధులు రావడంతో, మిగిలిన 10 లక్షల 33 వేల రూపాయలను తమ కుటుంబం పేరిట ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆలయ పున నిర్మాణానికి విరాళంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ వర్ధినిడి వెంకటేశ్వరరావు, ఆలయ ధర్మకర్తల మండల ఛైర్మన్ మందవరపు శ్యామ్ సుందర్, ఆలయ ఇఒ ఫణి కిషోర్ పాల్గొన్నారు.

అభినందనీయులు వెంకటేశ్వరరావు

ఎంఎల్‌ఎ రామరాజు, డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు

ప్రజాశక్తి - కాళ్ల

దొడ్డనపూడి హైస్కూల్లో సుమారు రూ.పది లక్షలతో కళావేదిక, షెడ్డు నిర్మించిన దాత కొల్లి శ్రీవేణుగోపాల వెంకటేశ్వరరావు (పెదకాపు) అభినందనీయులని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. సోమవారం దొడ్డనపూడి హైస్కూల్లో నిర్మించిన షెడ్డును ఎంఎల్‌ఎ ప్రారంభించారు. కళా వేదికను డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామరాజు మాట్లాడుతూ దాత వెంకటేశ్వరరావు స్ఫూర్తితో ఇంకా దాతలు ముందుకొచ్చి పాఠశాలల అభివృద్ధికి, గ్రామాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను నాడు - నేడు నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ సర్పంచి కొలి సుబ్బారావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పాఠశాలలు, గ్రామాభివృద్ధికి దాతలు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సోమేశ్వరరావు, ఎంపిపి శిరీష విశ్వనాథరాజు, ఎంపిటిసిలు కాశీ, సత్యనారాయణ, మాజీ ఎంపిపి ఆరేటి వెంకట రత్నప్రసాద్, వైసిపి మండల అధ్యక్షులు రాంబాబు, టిడిపి మండల అధ్యక్షులు జి.నాగేశ్వరరావు, గుండా సాయి, ప్రధానోపాధ్యాయిని ఇందిర పాల్గొన్నారు.


షెడ్డును ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

జగనన్న ఇళ్ల మంజూరులో అవకతవకలు : జనసేన

ప్రజాశక్తి - పెనుమంట్ర

పొలమూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఇళ్ల స్థలాల భూముల కొనుగోలు నుంచి లబ్ధిదారుల ఎంపిక వరకూ ప్రతి చోట వైసిపి నాయకులు అవకతవకలకు పాల్పడ్డారని జనసేన గ్రామ అధ్యక్షులు తోరం వెంకన్నబాబు విమర్శించారు. జగనన్న ఇళ్లు పేదల కన్నీళ్లు కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి చేగొండి సూర్యప్రకాష్ ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షులు కోయ వెంకట కార్తీక్ అధ్యక్షతన జగనన్న కాలనీలను సోమవారం పరిశీలించారు. ఈ స్థలాల కొనుగోలు వ్యవహారం వల్ల వైసిపి నాయకులకు లబ్ధి చేకూరే విధంగా ఉందని తెలిపారు. అర్హతలేని వారికి సైతం రూ.20 వేలు కడితే స్థలాలు ఇచ్చారని తెలిపారు. అర్హత లేకున్నా స్థలాలు ఎలా మంజూరు చేసారని ఆరోపించారు. అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పొలమూరు గ్రామ ఉపాధ్యక్షులు వేంద్ర కృష్ణకాంత్, లోకేసుల సత్తిబాబు, గుండేపల్లి నర్సిం పాల్గొన్నారు.

ఆచంట: పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జగనన్న ఇళ్లు నిరుపేదల కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆచంటలో జగనన్న కాలనీలో ఫ్లెక్స్ కార్డుతో జనసేన నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆచంట పంచాయతీ పరిధి బాలవారిపాలెంలోని జగనన్న కాలనీలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీరు, కరెంటు తదితర సమస్యలు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ శ్రీనివాస్, గ్రామ అధ్యక్షులు నంబూరి విజయ్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : జగనన్న ఇళ్లు పేదలకు కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా జనసనే నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సొమ్మును జేబులో వేసుకుని పథకాల పేరు చెప్పి దాదాపు 15 వేల కోట్ల రూపాయలు లూటీ చేసిందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.